క్లుప్తంగా

ప్రారంభానికి నోచుకోని మంచినీటి పథకం

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అంచనా విలువ రూ.3 లక్షలు



కోరుకొండలో ప్రారంభించని వాటర్ ట్యాంకు

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండలో నిర్మించిన మంచినీటి ట్యాంకు ప్రారంభానికి నోచుకోలేదు. దీనిని పంచాయతీరాజ్‌శాఖ గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్య విభాగాల ఆధ్వర్యంలో అంచనా విలువ రూ.3 లక్షలతో నిర్మించారు. నిర్మించి నెలలు గడుస్తున్నప్పటికీ ప్రజలకు తాగునీరందించాలన్న లక్ష్యాన్ని నెరవేర్చకుండా తాత్సారం చేస్తున్నారు. త్వరితగతిన ప్రారంభించి నీరందించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పవిత్ర క్రీస్తు శరీర, రక్తాల పండుగ

కోరుకొండ చర్చిలో సందడి



వాక్య సందేశాన్నిస్తున్న రెవరెండ్ ఫాదర్ మాణిక్యం

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండ ఎస్.ఆర్‌నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం పవిత్ర క్రీస్తు శరీర, రక్తాల పండుగను నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ మానిక్యం ఈసందర్భంగా వాక్య సందేశాన్నిచ్చారు. యేసుక్రీస్తు పరలోకం నుంచి భుమికిదిగివచ్చి, మానవరూపంలో సిలువై మానవాళి కోసం మరణించారన్నారు. ఈ సందర్భంగా తన శరీర, రక్తాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా మానవాళి విముక్తి సిద్ధిస్తోందన్నారు. దానిలో భాగంగానే ఆర్‌సీఎం లో గోదుమ అప్పము, ద్రాక్షారసాన్ని క్రైస్తవులకు అందిస్తున్నామన్నారు. ప్రపంచంలో యుద్ధాలు సమసిపోయి, శాంతిని ఏర్పాటు చేయాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ఉపదేశి బెల్లపు డేవిడ్, సంఘ పెద్దలు అంథోని, బూసి వసంత కుమార్, విక్టర్, రుంజల వరమ్మ, దివ్య పాల్గొన్నారు.

వంటపాత్రల బహూకరణ



వంట పాత్రలు అందిస్తున్న నాయకులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలకు మధ్యాహ్న భోజనం కోసం వంట పాత్రలు బహూకరించినట్టు పాఠశాల హెచ్ఎం రమాదేవి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ పాఠశాలకు మధ్యాహ్న భోజనం ట్రస్టు నుంచి వచ్చేదన్నారు. అయితే కొంతమంది విద్యార్థులు ఈ భోజనం ఇష్ట పడకపోవడంతో ఇక్కడ వంట చేసే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వంటకు అవసరమైన పాత్రలను అద్దెకు తీసుకువస్తున్నామన్నారు. ఈ విషయాని గ్రహించిన బిక్కవోలు ఎఫ్‌సీఐ జట్టు సుమారు రూ.30వేలు విలువగల పాత్రలు, గ్యాస్ స్టవ్ కుడా అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె వాసు, చిట్టిబాబు చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, సింగరపు రామారావు, ఉపాధ్యాయుడు జంగా శ్రీనువాస ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

అనపర్తి : మండలంలోని లక్ష్మీ నరసాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో ప్రవేశానికి మిగులు సీట్ల భర్తీకీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ వి.నాగేశ్వరరావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. ఈ నెల 24న దరఖాస్తులు స్వీకరిస్తారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏదైనా గురుకుల పాఠశాలలో దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. 25న లక్ష్మీనరసాపురం గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని 6,7తరగతులకు ఉదయం 10 నుంచి, 8,9 తరగతులకు మధ్యాహ్నం 2గంటల నుంచి పరీక్ష ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

నరసన్న ఆలయానికి భక్తుల రద్దీ

కోరుకొండ: కోరుకొండలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ భక్తుల సందడి ఏర్పడింది. కోరిన కోర్కెలు తీర్చే స్వామి అనే నమ్మకంతో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. సెలవురోజు కావడం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

మెట్టలో ఖరీఫ్ వరి సాగుకు శ్రీకారం



నరేంద్రపురంలో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



వెలుగుబందలో వరి నారును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కూలీల కొరతను నివారిస్తున్న బెంగాలీలు

రాజానగరం: మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ వరి సాగుకు మండలంలోని నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెంలలో శ్రీకారం చుట్టారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో తొలకరి పంట సాగుకు అన్నదాతలు సమాయత్తమయ్యారు. సీజన్ ఏదైనా తమదే ముందడుగు అనే విషయాన్ని మెట్ట రైతులు సార్థకం చేసుకుంటూ, వరి నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం బోర్లు ఉన్నచోట నాట్లు పడుతున్నాయి. అయితే ఈ సమయంలో స్థానికంగా కూలీల కొరత రైతులను వేధిస్తున్నా, ఆ లోటును భర్తీ చేస్తూ బెంగాలీ కూలీలు చురుకైన పాత్రను పోషిస్తున్నారు.

గొట్టపు బావులతోనే..

సాగు నీటి సదుపాయాలు సమృద్ధిగా లేకపోయినా, గొట్టపు బావుల సదుపాయంతో మండలంలోని రైతులు ఖరీఫ్ వరి సాగుకు శ్రీకారం చుట్టారు. మండలంలోని నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెంలలో నాలుగు రోజులుగా వరి నాట్లు వేయడంలో రైతులు తలమునకలుగా ఉన్నారు. అయితే స్థానికంగా కూలీల కొరత ఉన్నప్పటికీ ఆ లోటును బెంగాలీ కూలీలు గత ఎనిమిది సంవత్సరాలుగా భర్తీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఇక్కడకు చేరుకున్న బెంగాలీ కూలీలద్వారా వరినాట్లు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో 15,685 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్ వరి సాగు జరుగుతోంది. ప్రస్తుతం పైన పేర్కొన్న కొన్ని గ్రామాలలో 125 ఎకరాలలో వరి నాట్లు వేస్తున్నారు.

క్రమపద్ధతిలో వరి నాట్లు

బెంగాలీ కూలీల వరి నాట్లు వేసే విధానం ఒక పద్ధతిలో ఉంటూ, వ్యవసాయాధికారులను సైతం ఆకట్టుకుంటుంది. వరి నారు తీయడం, క్రమపద్ధతిలో నాట్లు వేయడం అంతా మగ కూలీలే చేస్తారు. ఇందుకుగాను ఎకరాకు రూ.3,500 కాంట్రాక్టు తీసుకుంటారు. దీనివలన ఖర్చులు, సమయం ఆదా కావడంతోపాటు ఒకటి, రెండు మొక్కలనే తీసుకుని నాటడం వలన దుబ్బులు బాగా చేసి, దిగుబడులు కూడా బాగుంటున్నాయని రైతులు అంటున్నారు. జూలై 15 నాటికి మిగిలిన ప్రాంతాలలో కూడా వరి నాట్లు వేయడం ప్రారంభమవుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు. పలు ప్రాంతాలను సందర్శిస్తూ వస్తున్న అధికారులు నార్లు వేయడం, సస్యరక్షణ చర్యలు చేపట్టడం, వరి నాట్లు వేయడంలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

బోర్లు ఉన్నచోట నాట్లు వేస్తున్నారు

మెట్ట ప్రాంతంలో బోర్లు అధికంగా ఉన్న రాజానగరం పరిసర ప్రాంతాలలో వరి నాట్లు వేయడం అన్ని ప్రాంతాల కంటే ముందు ప్రారంభమవుతుంది. ఈ సమయంలో మిగిలిన ప్రాంతాలలో వరి నారుమడులు కడుతున్నారు. జూలై 15 నాటికి పూర్తిస్థాయిలో నారు సిద్ధం కావడమే కాకుండా నాట్లు వేయడం కూడా వేగవంతం అవుతుంది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్న తరుణంలో రైతులు సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తున్నాం.

– ఎ. కల్యాణ్ సూర్యకుమార్, వ్యవసాయాధికారి, రాజానగరం

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పంటలకు జీవం పోసిన వర్షం



మెట్టలో వర్షాలకు జీవం పోసుకున్న మొక్కజొన్న తోట

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో శని, ఆదివారాల్లో కురిసిన వర్షం పంటలకు జీవం పోసింది. దీంతో పంట పొలాలకు నీటి ఎద్దడి తొలగింది. ముఖ్యంగా కూరగాయలు, ఆకు కూరలు, అరటి, వంగ, బీర, ఆనప, మిరప పంటలకు, మొక్కజొన్న, బొప్పాయి, జామ, పామాయిల్, కొబ్బరి తోటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు పనులకు కూడా ఈ వర్షం ఉపయోగపడుతుంది. నారుమడులు వేయడానికి, వేసిన ఆకుమడులు ఏపుగా ఎదగడంతో పాటు సకాలంలో వరి నాట్లు పడటానికి అవకాశం కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇంకా ఎక్కువగా వర్షాలు కురవాలని అప్పుడే ఖరీఫ్ పనుల ప్రారంభం అవుతాయని రైతులు అంటున్నారు. ఈ తడులు ప్రస్తుతం ఉన్న పంటలు జీవానికి ఉపయోగపడుతుందన్నారు. కాగా మండలంలో శనివారం 8.2, ఆదివారం 4.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఘనంగా శ్రీపాశాలమ్మ జాతర



జాతర సందర్భంగా కిటకిటలాడిన శ్రీపాశాలమ్మ అమ్మవారి ఆలయం



కాతేరు - సీతానగరం నాలుగు లేన్ల రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

సీతానగరం: మండలంలోని కాటవరం గ్రామ దేవత శ్రీపాశాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పదమూడేళ్ల అనంతరం జరిగిన శ్రీపాశాలమ్మ అమ్మవారి జాతర ఐదురోజులు సాగింది. పెద్ద ఎత్తున బాణసంచా కాల్పులతో, గణపతి పూజ, చండీహోమం నిర్వహించి, సాంస్కృతిక ప్రదర్శనలు, జాతర బలిచేట కార్యక్రమం వంటివి ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారిని ఊరేగింపుగా పుట్టింటికి తీసుకువచ్చి, అనంతరం ఆదివారం శ్రీఅమ్మవారిని అత్తింటికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జాతర మహోత్సవం జరిగింది. ఈ ఏడాది శ్రీఅమ్మవారి ఆలయం పునః నిర్మాణం జరిపి, విగ్రహ పునః ప్రతిష్ఠ చేశారు. అనంతరం ఈ నెల 18 నుంచి 22 వరకు జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం శ్రీఅమ్మవారికి మంగళ హారతి ఇవ్వడంతో జాతర కార్యక్రమం ముగిసింది. గ్రామస్తులు ఆదివారం అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి బంధువులకు విందు ఏర్పాటు చేశారు. ఈ జాతర మహోత్సవంతో కాటవరం గ్రామం బంధువులతో కిటకిటలాడింది. దూర ప్రాంతాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి బంధువులు వచ్చారు. దీంతో కాతేరు – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డులో కాటవరం వద్ద వాహనాలతో నిండిపోయింది. అయితే ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగలేదు. ఆఖరి రోజు వీధులు, ఇళ్లు బంధువులతో నిండిపోయాయి. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు నివాసంతో పాటుగా పలువురి నివాసాలకు వెళ్లారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సీతానగరం/కోరుకొండ: సీతానగరం, కోరుకొండ మండలాల్లో ఇటీవల పలు కారణాలతో మరణించిన వారి కుటుంబాలను, అనారోగ్యంతో చికిత్స పొందినవారిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదివారం పరామర్శించారు. సీతానగరం మండలం రాపాకలో సబ్బితి చంటియ్య మరణించగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. సీతానగరంలో ఓసిరెడ్డి రామలింగయ్య తల్లి, బూలా వెంకటేష్ తల్లి, బూలా నరేష్ కుమారుడు, బుజ్జమ్మ ఇటివల మరణించిన కారణంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తవిటికి అరవాలు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కూనవరంలో పూటి రాజేశ్వరి, బడుగు కిషోర్, నందూరి కాపు, అయిల సూరన్న కాపు అత్తయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ



కూనవరంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సభ్యులను పరామర్శించారు. కోరుకొండ మండలం మునగాలలో అలమంద వెంకటలక్ష్మి ఇటివల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తలకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న డెగపాటి దోనుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాపవరంలో బర్రు అంజిబాబు తల్లి, పేరార సుబ్బారావు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసాపురంలో చొంగ చెంచారావు, కింతాడ వెంకన్న ఇటివల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చొంగా సత్తిబాబు, నక్కా అర్జునుడు, పెదపాటి శివ నాగేశ్వరరావు, సోడాసాని త్రిమూర్తులు అనారోగ్యంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న కారణంగా వారిని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు నల్లమోలు భాస్కర్, వెన్నెల అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, సుంకర నరసింహం, కోరుకొండ మండలం కన్వీనర్ అడప కనకరాజు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నక్కా రాంబాబు పాల్గొన్నారు

ఫుట్‌బాల్ జిల్లా జట్లు ఎంపిక



పోటీలకు ఎంపికైన జిల్లా జూనియర్ బాలుర జట్టు



పోటీలకు ఎంపికైన జిల్లా జూనియర్ బాలికల జట్టు

దేవరపల్లి: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడా మైదానంలో జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల విభాగాలకు జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఉదయం 11.గంటల నుంచి సాయంత్రం 5.గంటల వరకు పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 24న ఒంగోలులో జరుతున్న జోనల్ స్థాయి పోటీలకు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మేనేజరు అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్, ఫిజికల్ డైరెక్టర్ ఓరుగుంటి నాగరాజు, రామకృష్ణంరాజు, చాగల్లు పీడీ కేతా రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకవి ధర్మేష్‌కు సన్మానం

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన యువ కవి, విద్యా సామాజిక సంస్కర్త నక్కిన ధర్మేష్ కాకినాడలోని శ్రీశ్రీకళావేదిక సీఈఓ కళారత్న కత్తిమండల ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం చేతుల మీదుగా ఘన సన్మానం అందుకున్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీశ్రీకళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ పీఆర్ కళాశాలలో నిర్వహించిన 149వ జాతీయ ద్విశత కవి సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. కవి సమ్మేళనంతోపాటుగా పుస్తక ఆవిష్కరణలు, సుమారు 200 మంది కవులు పాల్గొన్నారు. బొబ్బిల్లంకకు చెందిన యువ కవి, విద్యా, సామాజిక సంస్కర్త నక్కిన ధర్మేష్‌ను శ్రీశ్రీకళావేదిక సీఈవో కళారత్న కత్తిమండల ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం చేతుల మీదుగా శాలువ కప్పి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. ఘన సన్మానం అందుకున్న ధర్మేష్‌ను మండలంలో పలువురు అభినందించారు.



యువకవి ధర్మేష్‌ను సన్మానిస్తున్న ప్రతాప్, ఈశ్వరి భూషణం

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల కుటుంబాలు

కుటుంబాలతో కలసి ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 45 రోజులుగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న తమను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తమ కుటుంబాలకు చెందిన మహిళలు, పిల్లలు, పెద్దలతో నిరసన ప్రదర్శన నిర్వహించి గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ భర్తలకు నెలకు రూ.15 వేలు జీతం అని రూ.2 వేలు కటింగులు పోను రూ.13 వేలు చేతికి ఇస్తారని ఆ మొత్తాన్ని ఇంటి అద్దె, విద్యుత్ బిల్లు, నిత్యావసరాలు, పిల్లల చదువులకు సర్దలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అప్పుడే తమ బతుకులు బాగు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమాదుల ఏసుబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుంగ యేషయారాజు, జిల్లా అధ్యక్షుడు కోటాని ముకుందరామ్, నగర అధ్యక్షుడు సిరికి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పాలిక బాల భవానీకుమార్, ఉపాధ్యక్షుడు మందనక్క సాయి, కోశాధికారి బొక్కా శ్రీను, వెదురుపర్తి ఏసు, బండారు గణేష్ పాల్గొన్నారు.

హిందు ధర్మ పరిరక్షణకు నడుం బిగించాలి

శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామీజీ

రాజమహేంద్రవరం రూరల్: హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ నడుం బిగించాలని అమరావతి తాళ్లపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామీజీ పిలుపునిచ్చారు. మన సంస్కృతీ సంప్రదాయాలను, ఆలయ వ్యవస్థ గొప్పతనాన్ని భావితరాలకు అందిస్తూ హిందు ధర్మాన్ని రక్షించుకోవాలనే ధృడ సంకల్పంతో కొంతమూరు షణ్ముఖ పీఠంలో పీఠాధిపతి స్కంధస్వామి స్థాపించిన 'ఆలయాలు హిందూ ధర్మ పరిరక్షణ సమితి'ని ఆయన, పలువురు స్వామీజీలు, ఆధ్యాత్మికవేత్తలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అడ్డతీగల పవనగిరి క్షేత్రాధిపతి తణుకు వెంకట్రామయ్య, మురమళ్ల శ్రీ విజయ దుర్గా పీఠం ఆస్థాన సిద్ధాంతి బాణాల దుర్గా వరప్రసాదాచార్యులు, హైదరాబాద్ బాలా త్రిపుర సుందరి పీఠం గురువు కృష్ణమోహన్‌స్వామి, కొంతమూరు సదానంద ఆశ్రమ నిర్వాహకులు సీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆలయాలను, హిందు ధర్మ పరిరక్షణను ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ధర్మాన్ని నమ్మి ఆచరించినా, విశ్వసించినా అన్నీ ధర్మమే ఇస్తుందన్నారు. ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాల పరిరక్షణకు కూడా అందరూ ముందుకు రావాలని



సమితిని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామిజీ, స్వామిజీలు, ఆధ్యాత్మిక వేత్తలు

ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో గో సంరక్షణ కేంద్రాల ఏర్పాటు, హిందువులు, దేవాలయాలపై జరుగుతున్న దాడుల దృష్ట్యా ప్రతీ హిందువు తనకు ఉన్న హక్కుల గురించి పూర్తిగా తెలుసుకుని సరైన రీతిలో, వాటిని ఎదుర్కొనే రీతిలో చైతన్యం తేవడమే సమితి ప్రధాన లక్ష్యమని తెలిపారు. పూర్వ గురుకుల విద్యా విధానం అమలు చేస్తూ పునః ప్రారంభించాలని, దేవదాయ ధర్మాదాయ శాఖ ఖజానా నుంచి ఈ కార్యక్రమాలను ప్రారంభించేలా జీవో జారీచేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ కుటుంబం నుంచి ఒక వ్యక్తిని ధర్మ రక్షకునిగా తయారు చేయాలని సూచించారు. ఈ సమితికి వ్యవస్థాపక అధ్యక్షులుగా స్కంధ స్వామి వ్యవహరించడం అభినందనీయమన్నారు. కంటిపూడి గ్రూప్స్ అధినేత కంటిపూడి సర్వారాయుడు, ఆడిటర్ పీవీఎస్ కృష్ణారావు, మహాసందేశ్ ఆఫ్ ది ట్రస్ట్ చైర్మన్ జె.సత్య శ్రీనివాస్, బీజేపీ రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, వైఎస్సార్ సీపీ జిల్లా వైద్యవిభాగ అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత, హిందు ధర్మ రక్షా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గురవయ్య, షణ్ముఖ సేన నుంచి పడాల వీరారెడ్డి, కుంచే సూర్య ప్రకాష్, ఏబీ సుబ్రహ్మణ్యం, ఉదయ్‌కుమార్, సూర్య వరప్రసాద్ రెడ్డి, వడ్డి రామకృష్ణ, స్కంధ సేన, నారీ శక్తి సేన సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం దేవాలయాల్లో నిత్య పూజలకు అవసరమైన కిట్లను అందజేశారు.